ప్రజాశక్తి

సోమవారం 8 మే 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# అల్లూరి ఆశయ సాధనకు కృషి

## వర్ధంతి సభల్లో వక్తలు - విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వాడవాడలా కార్యక్రమాలు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న రాఘవులు తదితరులు

**మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆదివారం వాడవాడలా జరిగింది. ఆ మహనీయుని విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజలు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు.**

ఎంవిపి.కాలనీ : అల్లూరి 99వ వర్ధంతి సభ విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ బివి.రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోందని, ఈ నేపథ్యంలో గిరిజనులను, మన్య ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఆ దిశగా అల్లూరి స్ఫూర్తితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక విభాగం బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గీతం కాలేజీ ప్రొఫెసర్ చిన్నయ్య సూరి, సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు. అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యదర్శి బి.గంగారావు, ట్రస్టు మెంబర్ ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు అల్లూరి చిత్రపటానికి బివి.రాఘవులు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు అల్లూరి సీతారామరాజు, గురజాడ గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి.

నగరంలోగల పార్క్ హోటల్ జంక్షన్ వద్దనున్న అల్లూరి మిగతా 2లో..



అల్లూరి విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న మేయర్



ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

# విశాఖకు మరో మణిహారం సీ - హారియర్

## సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలనలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖకు మరో మణిహారంగా సీ - హారియర్ మ్యూజియం నిలవనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఈ నెల 11న విశాఖలో జరిగే ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆయన పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మలతో కలిసి ఆదివారం పరిశీలించారు. సిఎం పర్యటించే సీ - హారియర్ యుద్ధ విమాన మ్యూజియం, వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం, ఆరిలోవ అపోలో ఆసుపత్రి ప్రదేశాలకు వెళ్లి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీ - హారియర్ మ్యూజియం విశాఖ వాసులకు, టూరిస్టులకు మరింత సమాచారాన్ని, ఆహ్లాదాన్ని చేకూరుస్తుందని అన్నారు. టియు 142, కురుసుర సబ్‌మెరైన్‌లకు సీ - హారియర్ మ్యూజియం కూడా తోడవడంతో విద్యార్థులు, యువత ఎన్నో విషయాలను తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన యుద్ధ విమానాన్ని గోవా నుంచి తీసుకువచ్చామని, ముఖ్యంగా ఐదు అంశాల ద్వారా ప్రదర్శన ఉంటుందని తెలిపారు. త్వరలోనే దీన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ నేవీ, ఎయిర్ ఫోర్స్‌కు మిగతా 2లో..

## యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

వార్త 6లో..

## ఎల్‌జి పాలిమర్స్ బాధితుల పాదయాత్ర

వార్త 4లో..

## ఆదివాసీ హక్కుల రక్షణకు ఉధృత పోరాటం

వార్త 2లో..



విశాఖ నగరంలోని కేంద్రీయ విద్యాలయం వద్ద హాల్ టిక్కెట్ల నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

# ప్రశాంతంగా నీట్

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (నీట్) విశాఖ నగరంలో ఆదివారం ప్రశాంతంగా సాగింది. నగరంలోని మల్కాపురం, తాటిచెట్లపాలెం సహా అన్ని కేంద్రీయ విద్యాలయాల్లోనూ, విశాఖ వ్యాలీ స్కూల్‌లోనూ ఈ పరీక్ష నిమిత్తం పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వద్ద కనిపించారు. సిసి కెమెరాల నీడన పరీక్షలు సాగాయి.

# ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలి

## సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

ప్రజాశక్తి - ఉక్కునగరం

ప్రభుత్వ ఆదేశాలతో వైజాగ్ స్టీల్ యాజమాన్యం కార్మికుల నూతన వేతనాల అమలుపై చేస్తున్న తప్పుడు ప్రచారాలు తక్షణం ఆపాలని, ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఉక్కునగరంలోని సంఘం కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం ముఖ్య కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్‌జెసిఎస్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా నేడు స్టీల్ కార్మికుల వేతన ఒప్పందం జరిగిందని అన్నారు. ప్రతి వేతన ఒప్పందం ప్రతి ఒక్క యూనియన్ అంగీకారంతోనే ఇప్పటి వరకూ జరిగి అమలవుతున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ నేడు దానికి విరుద్ధంగా మెజారిటీ నిర్ణయాన్ని అంగీకరిస్తున్నామని చెప్పి దొడ్డిదారిన ప్రభుత్వ ఆదేశాలతో స్టీల్ యాజమాన్యం మెలగడం దుర్మార్గమన్నారు. ఈ ఒప్పందంతో స్టీల్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలగడంతోపాటు నూతన కార్మికుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుందని తెలిపారు. అందుకే సిఐటియు ఈ ఎంఒయుపై సంతకం చేయలేదని మిగతా 2లో..



మాట్లాడుతున్న తపన్‌సేన్

మొదటి పేజీ తరువాయి..

### అల్లూరి ఆశయ సాధనకు కృషి

విగ్రహానికి మేయర్ గొలగాని హరివెంకట కుమారి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొప్ప పోరాట వీరుడు అల్లూరి అని కొనియాడారు. ఆమె వెంట డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరు సతీష్, కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.రాజు, తదితరులు ఉన్నారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు విభాగం, సంగీత నృత్య శాఖలు, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎం.విజయగోపాల్, నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్, సీనియర్ ఆచార్యులు పి.వరప్రసాదమూర్తి, రాయల సుబ్బారావు, ఆచార్య జి.యోహాన్ బాబు, అనురాధ, మంజులత, బూసి వెంకటస్వామి, వెలమల సిమ్మన్న పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సీతమ్మధారలోని అల్లూరి విగ్రహం వద్ద ఎఐడిఎస్‌ఒ ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం నగర అధ్యక్షులు కె.అఖిలాష్ మాట్లాడారు.

**కలెక్టరేట్ :** అల్లూరి భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక మహోజ్వల శక్తి అని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అల్లూరి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, పద్మలత, సమాచార శాఖ ఆర్‌జెడి వి.మణిరామ్, కలెక్టరేట్ ఎఒ ఈశ్వరరావు పాల్గొన్నారు.

### ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలి

అన్నారు. నూతన ఎంఒయు ద్వారా కార్మిక ప్రయోజనాలను రక్షించే విధంగా యాజమాన్య ప్రతిపాదనలతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. అస్తవ్యస్త నిర్ణయాలతో నేడు అమలవుతున్న స్టీల్ కార్మికుల వేతనాలపై కార్మికుల్లో అశాంతి నెలకొందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో స్టీల్ యాజమాన్యాలు అనుసరిస్తున్న వైఖరిపై మార్పు కోరుతున్నామని, లేనిపక్షంలో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. స్టీల్‌వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా మాట్లాడుతూ కార్మిక సంఘాల ఐక్యతకు విఘాతం కలిగించేదుకు యాజమాన్యం చేసిన కుట్రలో కొన్ని యూనియన్లు భాగస్వామ్యంకావడం దురదృష్టకరమని అన్నారు. ఎన్నడూ లేని విధంగా నూతన వేతన ఒప్పందంపై అలుముకున్న నీలినీడలను కార్మిక వర్గ ఐక్యతతో విచ్ఛిన్నం చేయాలని అన్నారు. స్టీల్ కార్మికవర్గం సత్యాన్ని గ్రహించి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారపోయడమే బిజెపి విధానమని విమర్శించారు. దీనిని ప్రతిఘటించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, నాయకులు జగ్గు నాయుడు, కెఎం.శ్రీనివాస్, ఎస్.రామారావు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జె.అయోధ్యరామ్, వైటి.దాస్, యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, యు.వెంకటేశ్వర్లు, టివికె.రాజు, పుల్లారావు, యు.మరిడయ్య, గంగాధర్, కెవి.సత్యనారాయణ, నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

### విశాఖకు మరో మణిహారం సీ - హారియర్

సంబంధించిన సాంకేతిక అంశాలను ప్రజలు తెలుసుకునే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని, కానీ ఈ మ్యూజియం ఏర్పాటు ద్వారా యువత, పిల్లలు ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ సీ - హారియర్ మ్యూజియం గొప్పతనాన్ని వివరించారు.

అనంతరం వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం వద్ద ముఖ్యమంత్రి హెలీప్యాడ్ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేడియం వద్ద ఏర్పాటు చేయనున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కార్యక్రమ ఏర్పాట్లపైనా చర్చించారు. ఆరిలోవలో అపోలో క్యాన్సర్ ఆసుపత్రిలో కార్యక్రమ ఏర్పాట్లపై ఆసుపత్రి నిర్వాహకులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్ రెడ్డి, వీఎంఆర్‌డిఎ, జివిఎంసి, ఆర్ అండ్ బి, పోలీసు, ఫైర్, ఎపిఇపిడిసిఎల్ అధికారులు పాల్గొన్నారు.

### ప్రతిభా పురస్కారాల అందజేత

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఉత్తరాంధ్ర శిష్టకరణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. శిష్టకరణం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టర్నర్ చౌల్ట్రీలోని మెయిన్ రోడ్డులో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు మనాపురం సురేష్ అత్యధిక మార్కులు సాధించిన 30 విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర శిష్టకరణం కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, ఉరిటి అప్పారావు, జర్నలిస్టు సంఘం నాయకులు పోతుమహంతి నారాయణ, డబ్బీరు గాయత్రి, పాత్రేలు జయపట్నాయక్, ఎం.రవికాంత్ పాల్గొన్నారు. సదాశివుని కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉరిటి అప్పారావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు.

### నవ్వుతో ఒత్తిడిని జయించొచ్చు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** నవ్వడం ఒక యోగమని, నవ్వడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. బీచ్ రోడ్డులోగల బాల వికాస్ ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్‌లో ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా బాలలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేది నవ్వేనని, విద్యార్థులకు సమస్యలను ఎదుర్కోవడానికి ఆత్మస్థైర్యం అవసరమని, అందుకు నవ్వే సులువైన మార్గమని తెలిపారు. ఈ సందర్భంగా బాలలకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, సుజాత, మంజు, అప్పారావు పాల్గొన్నారు.

# పర్యాటకాభివృద్ధికి కృషి

**బొజ్జన్నకొండ, కొండకర్ల ఆవ, బీచ్‌ల వద్ద సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు**

**'ప్రజాశక్తి'తో పర్యాటక శాఖ అనకాపల్లి జిల్లా అధికారి కోరాడ అశోక్**

**ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో పర్యాటకాభివృద్ధికి కృషి చేయనున్నట్లు పర్యాటక శాఖ అనకాపల్లి జిల్లా అధికారి కోరాడ అశోక్ తెలిపారు. బొజ్జన్నకొండ, కొండకర్ల ఆవ, బీచ్‌ల వద్ద వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..**






**జిల్లాలో టూరిజం అభివృద్ధికి చేస్తున్న కృషి ఏంటి ?**

అనకాపల్లి నూతన జిల్లాగా ఏర్పడిన నేపథ్యంలో టూరిజం పరంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో వివిధ సంస్థలతో ఎంఒయులు చేసుకునేందుకు ప్రతిపాదనలు చేపడుతున్నాం.

**ఏయే ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి అవకాశాలున్నాయి ?**

జిల్లాలో ప్రధానంగా బౌద్ధారామ క్షేత్రం బొజ్జన్న కొండ, కొండకర్ల ఆవ, పూడిమడక బీచ్, నక్కపల్లి, రేవు పోలవరం, ముత్యాలమ్మ పాలెం బీచ్‌ల వద్ద పర్యాటక అభివృద్ధికి అవకాశాలున్నాయి. ఎవరైనా ప్రతిపాదనలతో ముందుకు వస్తే 33 సంవత్సరాలపాటు లీజుకి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. పిపిపి పద్ధతిన పర్యాటకాన్ని అభివృద్ధి చేసే ఆలోచన ఉంది.

**పర్యాటక ప్రాంతాల్లో కల్పిస్తున్న సౌకర్యాలేంటి ?**

పైన తెలిపిన ప్రాంతాల్లో ఎమినిటీస్ పరంగా టూరిస్టుల కోసం రెస్టారెంట్, టాయిలెట్స్ అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. బొజ్జన్న కొండ వద్ద ఎకరా 40 సెంట్లును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

**భవిష్యత్తు ప్రణాళికలేంటి ?**

జిల్లాలో ఎక్కువ తీర ప్రాంతం ఉండడంతో బీచ్‌లను అభివృద్ధి చేస్తే బాగుంటుందని భావించాం. ప్రధానంగా నక్కపల్లి జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో వాహనాలపై వచ్చేవారికి కావాల్సిన సౌకర్యాలు అందిస్తే టూరిజం అభివృద్ధి అవుతుంది.

విశాఖపట్నంతో పోలిస్తే అనకాపల్లి జిల్లాలో భూముల ధర తక్కువ ఉండడంతో లీజుదారునికి తక్కువ రేటుకే లీజ్ ఫిక్స్ అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో టూరిజం శాఖకు ఇంకా కార్యాలయం ప్రారంభించలేదు. జూనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. కలెక్టర్ సహకారంతో సిబ్బంది ఏర్పాటుకు, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తాం.

# ఆదివాసీ హక్కుల రక్షణకు ఉధృత పోరాటం

**గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర**

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** గిరిజన హక్కుల రక్షణకు పోరాటానికి సిద్ధం కావాలని ఆదివాసీలకు గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా మహాసభ జరిగింది. తొలుత అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి మహాసభ ఘన నివాళులర్పించింది. అనంతరం ముఖ్య అతిథి సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలోకి చేర్చుతూ తీర్మానం చేసిందన్నారు. ఆ ప్రయత్నాన్ని అల్లూరి స్ఫూర్తితో తిప్పికొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ చట్టాలను ఉల్లంఘిస్తూ బడా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్టులు, మైనింగ్ పేరుతో అడవిని అప్పగిస్తున్నాయని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లోకి గిరిజనేతరులు వచ్చే విధంగా చట్టాలను మారుస్తోందన్నారు. అటవీ సంపదపై గిరిజనులకు పూర్తి హక్కు ఉండే విధంగా నాడు అల్లూరి సీతారామరాజు ఎలాంటి పోరాటం నడిపారో గుర్తుచేశారు. హక్కుల కోసం పోరాడుతున్న గిరిజనులపై నేటి పాలకులు నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. జిఒ నెంబర్ 3 చట్టబద్ధతకు పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సురేంద్ర

**నూతన కమిటీ ఎన్నిక**

అనంతరం సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సంఘం విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కిముడు చిన్నంనాయుడు, జివి.రమణమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఉల్లి బొంజుబాబు, ఆఫీస్ బేరర్లుగా కృష్ణ నాయక్, సత్యనారాయణ, సాంబమూర్తి, పార్వతమ్మ, పద్మ, సోబన్ కుమార్, గోపాల్, బి.తౌడన్న, జె.రామన్న, టి.చిట్టిబాబు, జానకిరాజు, సత్యారావు, గీత ఎన్నికయ్యారు.

# దేశాన్ని ప్రైవేటీకరిస్తున్న మోడీ

**ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్**

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని ప్రైవేటీకరిస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే చర్యలు చేపడుతున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ అన్నారు. ఆశీలు మెట్ట వద్ద ఉన్న కెఎ.పాల్ ఫంక్షన్ హాల్‌లో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో లాభాల్లో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్, ఎల్ఐసిలను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, అందుకు జూన్ 8వ తేదీ వరకు గడువు ఇస్తున్నామని అన్నారు. తర్వాత పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్రం అనుమతిస్తే నెల రోజుల వ్యవధిలో అమెరికా నుంచి రూ.4 వేల కోట్లు తెచ్చి ప్లాంట్ పరిరక్షణతో పాటు విస్తరణ పనులు చేపడతామన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జూన్ 4న కెఎ పాల్ ఫంక్షన్ హాల్ వద్ద భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పోరాడుతున్న నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు కెఎస్ఎన్.రావు, రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, విల్లా రామ్మోహన్ కుమార్ పాల్గొన్నారు.

# తుపాను రక్షిత భవనాన్ని పునర్నిర్మించాలి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం పెద నాగమయ్యపాలెంలో శిథిలావస్థకు చేరిన తుపాను రక్షిత భవనాన్ని పునర్నిర్మించాలని, లేదా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేసిన నిధులు రూ.18 లక్షలు మంజూరు చేసి మరమ్మతు పనులు చేయాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత తుపాను రక్షిత భవనం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ వార్డు సభ్యులు దూడ పోలయ్య, ఎం కొర్లయ్య, స్థానికులు గరికిన పరశురాం, దూడ ధనంకొండ, బడే ఎల్లారావు మాట్లాడుతూ, తుపాను రక్షిత భవనాన్ని పునర్నిర్మించాలని చెప్పిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులే మరమ్మతులకు రూ.18 లక్షలు మంజూరుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీకి చెందిన సర్పంచ్ అధ్యక్షతన జరిగిన పంచాయతీ సమావేశంలో కోరం లేకుండానే తుపాను రక్షిత భవనం కూల్చి వేతకు తీర్మానం చేయడమంటే సమావేశాన్ని అగౌరవ పరచడమేనని పేర్కొన్నారు. అధికారులు దంద్వనీతిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. నూతనంగా తుపాను భవనాన్ని పునర్నిర్మించడం చేతకాని వారు భవనం కూల్చివేతకు ఉత్సాహం చూపడం తగదన్నారు.



తుపాను రక్షిత భవనం వద్ద నినాదాలు చేస్తున్న పలువురు గ్రామస్తులు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

## పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం పెద నాగమయ్యపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పలువురు రోగులకు వైద్యులు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిహెచ్.అప్పలనాయుడు మాస్టారు జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యుల సహకారంతో అనిల్ నీరుకొండ ఆసుపత్రి ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు మౌనిక, చంద్రశేఖర్, వర్షిణి, సాయి అనూష, దివ్య రోగులను పరీక్షించి మందులు అందించారు. ఆసుపత్రి పిఆర్ఒలు, రాము, రమేష్, సతీష్ సేవలందించారు. ఇదే సందర్భాన్ని పురస్కరించుకుని గత నెల 18 నుంచి మే 7వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

## గ్రామాల్లో ఆలయాల ప్రతిష్ట

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో అలయాల ప్రతిష్ట కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. మండలంలోని కోరాడలో గ్రామ దేవత పైడితల్లమ్మ ఆలయాన్ని కొత్తగా నిర్మించారు. ఆలయ ప్రారంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను సర్పంచ్ కోరాడ లక్ష్మణ, మంజు దంపతుల ఆధ్వర్యాన నిర్వహించారు. వెంకటాపురం గ్రామంలో శ్రీఅభయాంజనేయ దేవాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి భీమిలి ఇన్‌ఛార్జి ఎం.మహేష్, ఎంపిపి కె.రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నేటి నుంచి

## వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి బివిఎస్.అప్పారావు తెలిపారు. జూన్ 11వ తేదీ వరకు గ్రంథాలయంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజ్ఞాన శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పుస్తక పఠనం, ఆముద్రిక కథలు పుస్తక సమీక్ష, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాలు ఉంటాయన్నారు.

# జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కొన్ని గ్రామాల్లో మట్టి అక్రమ తవ్వకాలు అందరి సహకారంతో జోరుగా సాగుతున్నాయి. మండలంలోని పొట్నూరు గ్రామానికి చెందిన మజ్జివానిచెరువు తునివలస పంచాయతీకి దగ్గరలో ఉండటంతో అక్రమార్కులకు మంచి అనువుగా ఉంది. రోజూ రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. కోరాడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గత 20 రోజులుగా మట్టి అమ్మకాలు జోరుగా సాగిస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటుక బట్టీల యాజమానులతో ముందుగా బేరసారాలు చేసుకొని మట్టిని తరలిస్తున్నాడని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు ఎవరైనా వస్తే దాడి చేయడానికి కూడా కొంతమందిని నాలుగుచోట్ల ఏర్పాటుచేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారమంతా అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతోనే జరుగుతందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని మరికొన్ని గ్రామాల్లో కూడా మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

# సమకాలీన అంశాలపై పట్టు పెంచుకోవాలి

## పాఠశాల విద్యా కమిషనర్



మాట్లాడుతున్న పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి-భీమునిపట్నం : సమకాలీన అంశాలపై పట్టు పెంచుకోవాలని పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ డైట్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డైట్‌ను ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ డాక్టర్ ప్రతాపరెడ్డితో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా డైట్‌లను బలోపేతం చేయనున్నామని తెలిపారు. ప్రతి డైట్ కూడా ఏదైనా సందర్భంలో తన ప్రత్యేకతను చాటుకోవాలన్నారు. విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంఛార్జి రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి, డిఇఒ ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ గౌరీ శంకర్, ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల కురిసిన వర్షాలకు ఉద్యాన పంటలు ఏ మేరకు దెబ్బతిన్నాయో తెలుసుకునేందుకు ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ పివి.రమణ, జిల్లా ఉద్యాన అధికారి కె.మన్మధరావు, డివిజన్ ఉద్యాన అధికారి పి.స్వాతిలతో కలిసి ఆదివారం భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పర్యటించారు. బొప్పాయి, అరటి, మామిడి, కూరగాయలు, పూల తోటలను పరిశీలించారు. రాబోయే నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా పంటలు దెబ్బ తినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. క్షేత్ర స్థాయి ఉద్యాన అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. శాస్త్రీయ పద్దతులు పాటించాలని కోరారు.

ఆనందపురం మండలం గంభీరం, గిడిజాల, పద్మనాభం మండలం అనంతవరం, రెడ్డిపల్లి ప్రాంతాల్లో ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆర్‌బికెల సిబ్బంది పాల్గొన్నారు.



గిడిజాలలో ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న పివి.రమణ

## నేరాలు ఘోరాలు

### వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-సీతమ్మధార : అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందినట్లు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... తాటిచెట్ల పాలెం రైల్వే క్వార్టర్స్ వెనుక కార్ డ్రైవింగ్ సీట్‌లో సతీష్ కుమార్ (40) మృతిచెంది ఉన్నాడు. స్థానికులు చూసి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. మృతుడు అన్న సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ షణ్ముఖరావు తెలిపారు.




పట్టుబడ్డ గంజాయి

### 19 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నంకు చెందిన ఓ ప్రైవేటు బస్సులో 19 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామని గొలుగొండ ఎస్ఐబి సిఐ రాజారావు పేర్కొన్నారు. అల్లూరి జిల్లా చిత్రకొండ నుంచి నర్సీపట్నానికి వెళుతున్న ఎస్ఆర్‌సిఎంటికి చెందిన బస్సులో గంజాయి రవాణా జరుగుతుందని ముందస్తు సమాచారం రావడంతో గొలుగొండ మండలం ఏటిగైరంపేట వద్ద శనివారం సాయంత్రం బస్సును ఆపి తనిఖీ చేశామన్నారు. 19 కేజీల గంజాయి లభ్యమైందని, నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద 12వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకున్నామన్నారు.

### కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో తాళ్ళపాలెం జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం తాళ్లపాలెం జెడ్‌పి హైస్కూల్ ఎదురుగా, జాతీయ రహదారిపై, అనకాపల్లి నుండి ఎలమంచిలి పోవు రోడ్డులో గుర్తుతెలియని 40-45ఏళ్ల వయస్సు గల వ్యక్తి రోడ్డు దాటుతుండగా, అనకాపల్లి నుంచి ఎలమంచిలి వైపు కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. దీనిపై విఆర్ఒ బొడ్డేడ శివాజీ కశింకోట పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ఆదినారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 66 మంది రక్తదానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : నీడి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక సన్ స్కూల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 66 మంది రక్తదానం చేశారు. బిఎన్‌డబ్ల్యు అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, హోటల్ బ్లిస్ కేటరింగ్ ఎమ్‌డి లక్ష్మీలావణ్య, బిఎన్‌డబ్ల్యు సభ్యులు ఎ.నాగరాజు, ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ళ సన్నీ, ఆర్ బసవకృష్ణమూర్తి, ఎఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అపూర్వ, మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ప్రతినిధులు

## నిరుద్యోగ యువతకు శిక్షణ

**ప్రజాశక్తి -కంచరపాలెం :** నిరుద్యోగ యువత కోరుకునే కోర్సుల్లో శిక్షణ ఇప్పించి, ఉద్యోగకల్పనకు ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రయత్నం చేస్తోందని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. కంచరపాలెంలోని స్కిల్ హబ్‌లో ఆదివారం ఆ సంస్థ ఎండీ వినోద్‌కుమార్‌తో కలిసి సురేష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీలోని అన్ని పరిశ్రమల్లోనూ స్థానిక యువతకు 75శాతం ఉద్యోగాలు లభించేలా ప్రభుత్వం చట్టం చేసిందని గుర్తుచేశారు. అనంతరం అక్కడ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్టు అందజేశారు. ఇటీవల పలు సంస్థల్లో ఉద్యోగం సాధించిన అభ్యర్థులను అభినందించారు. ఎండీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ, ఏపీలోని 175నియోజకవర్గాల్లో 190 స్కిల్ హబ్‌లు ప్రారంభమయ్యాయని, శిక్షణ, ఉద్యోగ కల్పన కార్యక్రమాల్ని ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈడీ కోటిరెడ్డి, ఆర్‌ఎస్‌బిఒ రోహిణి, ఆ సంస్థ జిల్లా అధికారి సాయి చైతన్య, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ రమేష్ నాయుడు, జిల్లా అదనపు అధికారి స్వప్న తదితరులు పాల్గొన్నారు.



పలువురిని సత్కరిస్తున్న కళింగ యూత్ అసోసియేషన్ సభ్యులు

## మజ్జిగ పంపిణీ

**ప్రజాశక్తి-మాధవధార :** కీర్తిశేషులు పప్పల మాధవరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో ఆదివారం మాధవ యువజన సమాజం ఆవరణలో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్జున్ అవార్డు గ్రహీత డాక్టర్ జయరాం హాజరై వాహనదారులకు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇటువంటి చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన అసోసియేషన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. పప్పల వరాహనరసింహం మాట్లాడుతూ, మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులకు తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా అర్జున్ అవార్డు గ్రహీత డాక్టర్ జైరామ్, పప్పల వరహా నరసింహం, బాక్సింగ్ క్రీడాకారులు కానిస్టేబుల్ ప్రకాష్‌ను మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నంబాల ఈశ్వరరావు, కార్యదర్శి సనుపల శ్రీకాంత్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా నవ్వుల దినోత్సవం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, హైదరాబాద్ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన వినోదాల విందు కామెడీ షో నిర్వహించారు. కార్యక్రమంలో పలు కామెడీ షోలు ప్రదర్శించిన కవిత్వాలు, పెళ్ళాం ఊరెళితే, అత్తారింటికి అల్లుడు వచ్చాడు, తాగుబోతు రమేష్, వైద్యుడికి మస్కా తదితర స్కిట్లు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి ఈ సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రపంచ నవ్వుల దినోత్సవం నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. నవ్వుతో మనిషికి సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, ఎస్.నాగేశ్వరరావు, బాదంగిరి సాయి, హాస్య నటీనటులు ప్రేక్షకులు పాల్గొన్నారు.

## నేడు దుర్గమాంబ తోలేళ్ల మహోత్సవం

**ప్రజాశక్తి -కంచరపాలెం :** జీవీఎంసీ 56వ వార్డు పరిధి గొల్ల కంచరపాలెం గ్రామ దేవత దుర్గమాంబ అమ్మవారి తోలెళ్ళ మహోత్సవం ఈ నెల 8న, 9వ తేదీన ప్రధాన పండుగ నిర్వహించనున్నట్లు ఆ గ్రామ అధ్యక్షులు పల్లా సత్యనారాయణ తెలిపారు. తోలెళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తులు దొండపర్తి ఎరుకుమాంబ అమ్మవారి దేవాలయం నుంచి మేళతాళాలతో దుర్గ మాంబ ప్రతిమలను ఊరేగిస్తూ గొల్ల కంచరపాలెం శ్రీరామ మందిరం వద్దకు చేరుకుంటారని పేర్కొన్నారు. 9వ తేదీన ప్రధాన జాతర మహోత్సవాన్ని గొల్ల కంచరపాలెం శ్రీ సీతారామ సంపత్ వెంకటేశ్వర, ధనలక్ష్మి దేవి ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమలతో ప్రారంభమవుతుందని తెలిపారు.

# కార్మికులకు బటన్ నొక్కే శక్తి పెరిగేలా విధానాలుండాలి

### సిపిఎం కార్పొరేటర్ గంగారావు

**ప్రజాశక్తి-తగరపువలస:** 'అమ్మ ఒడి, ఆసరా తదితర పథకాల కోసం మీరు వేసే నిధుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలు, కార్మికులకు స్వయంగా వారే బటన్ నొక్కే శక్తిని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వ విధానాలుండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సూచించారు. తగరపువలస జంక్షన్‌లో సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం మే డే సాంస్కృతిక సంబరాలు ఆద్యంతం ఉత్సాహ పూరితంగా సాగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో గంగారావు మాట్లాడుతూ, కరోనా కష్టాల నుంచి ఇంకా కోలుకోని ప్రజలపై కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు ఆస్తి పన్ను పెంచి, చెత్త పన్ను విధించి, ఆర్టీసి ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు, వంట గ్యాస్ ధర పెంచి భారం మోపాయని ధ్వజమెత్తారు. చిట్టివలస జ్యూట్ మిల్లును తెరిపించడంలో తెలుగు బిడ్డగా మీ పౌరుషం ఏమైందని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే హక్కు ఎవరిచ్చారని తెలుగు వారిగా ప్రధాని నరేంద్ర మోడీని జగన్మోహన్ రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు ప్రశ్నించి, నిలేసే ధైర్యం చెయ్యలేక పోతున్నారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధపడాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. కార్మికుడు సృష్టిస్తున్న సంపదకు సరిపడా వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వడానికి ఈ ప్రభుత్వాలు ముందుకు రావడం లేదని వాపోయారు. కనీస వేతనం ఇవ్వని యాజమాన్యాలను జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు.

**ఉద్యోగ భద్రత కోసం ఉద్యమం**

ఉద్యోగ భద్రత కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు, ఎమ్మెల్యే, ఎంపీల జీతాలు పెరుగుతున్నాయని, కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం దేశ భక్తి ముసుగులో ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను కార్పొరేట్లకు అమ్మేస్తోందని విమర్శించారు. సంపద సృష్టి కర్తలైన కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వాలూ ఎక్కువ కాలం అధికారంలో ఉండలేవని స్పష్టంచేశారు. సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో కార్యదర్శి రవ్వ నరసింగరావు, యూనియన్ నాయకులు ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఎరుపెక్కిన వీధులు...**

ముందుగా సిఐటియు కార్యాలయం వద్ద ప్రారంభమైన కార్మిక ప్రదర్శన జంక్షన్ మీదుగా పట్టణ పుర వీధుల్లో సాగింది. అనంతరం సభాస్థలికి చేరింది. ఆశా, అంగన్వాడీ, ముఠా, ఆటో, క్వారీ తదితర రంగాల కార్మికులు అధిక సంఖ్యలో ప్రదర్శనలో పాల్గొన్నారు.

**ఆద్యంతం ఉత్సాహంగా కళా ప్రదర్శనలు..**

జానపద, డప్పు కళాకారులు, ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన విప్లవ, అభ్యుదయ గీతాలు ఆద్యంతం స్థానికుల్లో చైతన్యం నింపాయని చెప్పవచ్చు. గురజాడ నాటిక ఆలోచింప జేసింది. భీమిలి మండలం ఆశిపాలెం కళాకారులు ప్రదర్శించిన తప్పెట గుళ్ళు, టి.నగరపాలెం కళాకారులు ప్రదర్శించిన కోలాటం, ఉత్తరాంధ్ర జానపద కళాకారులు బొట్టా తవుడు పాడిన జాన పద గీతాలు ఎంతో ఆలోచింప జేశాయి. ప్రజానాట్య మండలి కళాకారులు పంపాన సూర్య నారాయణ, దల్లి రాంబాబు పాడిన అభ్యుదయ గీతాలు ఆలోచింపజేసాయి.



మేడే సాంస్కృతిక సంబరాల్లో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు



తగరపువలసలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు


కోలాటమాడుతున్న కళాకారులు

# ఎల్‌జి పాలిమర్స్ బాధితుల పాదయాత్ర



వెంకటాపురంలో పాదయాత్ర నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

**గోపాలపట్నం :** ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటనకు మూడేళ్లు కావడంతో వెంకటాపురం గ్రామంలో బాధిత కుటుంబాలతో కలిసి సిఐటియు నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు గోపాలపట్నం కార్యదర్శి బలివాడ వెంకటరావు మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన తరువాత ప్రభుత్వం బాధితకుటుంబాలకు ఎటువంటి సౌకర్యాలూ సమకూర్చలేదన్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తామని చెప్పి శంకుస్థాపనకే పరిమితమైన దుస్థితి ఈ ప్రభుత్వంలో ఉందని ఎద్దేవా చేశారు. వెంకటాపురం గ్రామం రెడ్ జోన్‌లో ఉందని, ఈ గ్రామానికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని విమర్శించారు. ఎల్‌జి పాలిమర్స్ యాజమాన్యం చేసిన తప్పుకు 370 మంది కాంట్రాక్ట్ కార్మికులు బలైపోయారన్నారు. వీరికి ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వకుండా చట్ట విరుద్ధంగా తొలగించారని తెలిపారు. సిఐటియు సీనియర్ నాయకులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ ఘటన జరిగిన నెల రోజులు తరువాత మూడు కుటుంబాలకు చెందిన వ్యక్తులు మరణించారని, వారికి రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.శ్రీనివాసరావు. పి.అనసూయ, ఎ.గోవిందరావు, బాధిత కుటుంబాలు పాల్గొన్నాయి.

**పెందుర్తిలో కొవ్వొత్తుల ప్రదర్శన**

**పెందుర్తి :**ఎల్‌జి పాలిమర్స్ ఘటనకు మూడేళ్లయిన సందర్భంగా పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ ఘటనతో ఎంతో మంది ఎంతోమంది వికలాంగులుగా మారారని, వారిని నేటికీ ప్రభుత్వం ఆదుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కడతానని హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా బాధితులను ఆదుకోవాలని, లేకుంటే భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, సంతోష్, రజిని తదితరులు పాల్గొన్నారు.


పెందుర్తిలో కొవ్వొత్తుల ప్రదర్శన

# చెప్పిన పని చేస్తేనే ఓట్లేయండి

## మూలపేటలో గడపగడపలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్



గడపగడపలో మంత్రి అమర్నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి : చెప్పిన పనిచేశాకే ఓట్లు అడిగేందుకు మీ దగ్గరకు వస్తానని రాష్ట్రమంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని మూలపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికులు రోడ్డు సమస్యను మంత్రి దృష్టికి తేగా, ఆయన స్పందిస్తూ, తాను ఈ ప్రాంతానికి రోడ్డు వేయిస్తానని, రోడ్డు వేశాకే ఓట్లు అడిగేందుకు వస్తానని, అప్పుడే ఓటేయాలన్నారు. రోడ్డు దుస్థితిపై గత ప్రభుత్వాల హయాంలో తాను నేతలకు విన్నవించిన సందర్భాలున్నాయన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమంలో ముఖ్యోద్దేశ్యమన్నారు. గ్రామంలో రూ.20 లక్షలతో తక్షణం రోడ్ల నిర్మాణం చేపట్టాలని, మరొక రూ.పది లక్షలతో కాలువ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్‌లో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. శారద నగర్ బ్రిడ్జి నుంచి సత్యనారాయణపురం రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా మూలపేటకు రోడ్డు కావాలని స్థానికులు కోరగా, త్వరలోనే ఆ పనులు చేపడతామని మంత్రి హామీనిచ్చారు. గంగాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని స్థానికులు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు జోసఫ్, ఎంపిటిసి మజ్జి అలివేణి పాల్గొన్నారు.

## కెటిఆర్‌ను కలిసిన ఎంవిఆర్



సినిమా ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో కెటిఆర్‌తో ఎంవిఆర్

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత, సినీ నిర్మాత ముత్యాల వెంకటేశ్వరరావు హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కెటిఆర్‌ను కలిశారు. మ్యూజిక్ స్కూల్ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో కెటిఆర్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో చిత్ర నటీనటులు, సాంకేతిక బృందం పాల్గొన్నారు.

## సన్ రిడ్జి స్కూల్ విద్యార్థుల జయభేరి



తేజస్వినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ సత్తిరెడ్డి

ప్రజాశక్తి -సబ్బవరం : టెన్త్ ఫలితాల్లో స్థానిక సన్ రిడ్జి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో జయభేరి మోగించారు ఈ ఏడాది 31 మంది పరీక్షలు రాగా, 29మంది ఉత్తీర్ణులయ్యారని, వారిలో 18 మంది 500 పైబడి మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్. సత్తిరెడ్డి తెలిపారు. ఇందులో బి. తేజస్విని (583) పాఠశాల టాపర్‌గా నిలవగా, తర్వాత స్థానాల్లో జె. త్రివేణితేజ (578), కె. గౌతమ్ (570) నిలిచారన్నారు పాఠశాల టాపర్ బి. తేజస్విని ప్రిన్సిపల్ ఎన్. సత్తిరెడ్డి అభినందించారు.

## మదర్ స్కూల్‌లో శతశాతం ఉత్తీర్ణత



పాఠశాల టాపర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

సబ్బవరం : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక మదర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి ప్రతిభ కనబరిచారు. 53 మంది పరీక్షలు రాయగా, శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ కోడి రమణ తెలిపారు. అందులో 20 మంది విద్యార్థులు 500 మార్కులకు పైబడి సాధించి జిల్లా స్థాయిలో సత్తాచాటారన్నారు. వంటకుల రూపక్ విశ్వాస్( 581) పాఠశాల టాపర్‌గా నిలవగా, కల్లూరి పూజామృత (576) రెండోస్థానంలో నిలిచి పాఠశాల టాపర్ రూపక్ విశ్వాస్‌ను కరస్పాండెంట్ కోడి రమణ అభినందించారు.

## సర్వజ్ఞ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్‌కు
## తల్లిదండ్రుల అభినందన

ప్రజాశక్తి- పరవాడ : మండల కేంద్రం పరవాడలోని సర్వజ్ఞ హైస్కూల్ ప్రిన్సిపల్ బొడ్డు నర్సింగరావును పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కతజ్ఞతలు తెలిపి, అభినందించారు. పరవాడలోనే జన్మించి, స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి, ఎయులో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన నర్సింగరావు, ప్రభుత్వ ఉద్యోగానికి ఎదురుచూడకుండా, ఈ ప్రాంత పేద, మధ్యతరగతి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, ఉత్తమంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతోసర్వజ్ఞ పబ్లిక్ స్కూల్‌ను 2003లోనే ప్రారంభించి, అంచెలంచెలుగా తరగతులను పెంచుతూ, 2012లో హైస్కూల్‌గా తీర్చిదిద్దారన్నారు. హంగుఆర్భాటాలు, ప్రచార పటాటోపం లేకుండా, నామమాత్రపు రుసుముతో క్రమశిక్షణతో కూడిన చదువును అందిస్తున్నారని కొనియాడారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాలకు చెందిన పి.సాయితేజ 589 మార్కులతో ఉత్తీర్ణత సాధించి, పాఠశాల టాపర్‌గా నిలవడంతో ప్రిన్సిపల్ బొడ్డు నర్సింగరావు కృషిని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ సిఎం బూడి

ప్రజాశక్తి-దేవరాపల్లి : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని తిమిరాం గ్రామంలోని మదర్ థెరిస్సా హైస్కూల్ విద్యార్థులను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం అభినందించారు. మాడుగుల నియోజకవర్గంలోనే టాపర్స్‌గా నిలిచిన మదర్ తెరిస్సా పాఠశాల విద్యార్థులు ని కరస్పాండెంట్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో తారువలోని బూడి క్యాంపు కార్యాలయంలో కలవగా, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు విద్యార్థులను అభినందించి వారిని ఘనంగా సత్కరించి మరింత ఉన్నత చదువులు చదవాలని ఆశీర్వదించారు. ఉపముఖ్యమంత్రి అభినందనలు పొందిన వారిలో పోతల భానుచందర్ (590), తుంపాల బాలాజీ (580), గేదెల హర్షిత (577), ఆడారి సుధా (577) ఉన్నారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కర రావు, పోతల శంకరరావు పాల్గొన్నారు.

## సత్తా చాటిన 'సెయింట్ జాన్స్' విద్యార్థులు



ఎం.భవ్యశ్రీ

కశింకోట : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు సత్తా చాటారు. 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణుల య్యారని, వీరిలో ఎం.భవ్యశ్రీ (588), ఎ.మేఘన (587) పాఠశాల టాపర్స్‌గా నిలిచారని స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబెల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ తెలిపారు ప్రతిభ చూపిన విద్యార్థులను వారితోపాటు ప్రిన్సిపల్ మహేష్ అభినందించారు. తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

**25 మంది శ్రీగీతా ప్రైమరీ హైస్కూల్ విద్యార్థుల ఉత్తీర్ణత**

కశింకోట : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని కన్నూరు పాలెం శ్రీ గీతా ప్రైమరీ హైస్కూల్ విద్యార్థులు 25 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఎస్ అన్నారావు తెలిపారు వీరిలో ఎస్ రమ్య (580), కె. దేవకి(570), ఎస్ దేవాక్షరి (560) మార్కులు సాధించగా, మరో 22మంది ఉత్తమమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. తమకు సహకరించిన తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతిభా విద్యాలయం ప్రభంజనం



నాగఝాన్సీరాణిని అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపల్

సబ్బవరం : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక ప్రతిభా విద్యాలయం విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. ఈ ఏడాది 140 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, వారిలో 134మంది ప్రథమశ్రేణిలో, నలుగురు ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. వీరిలో కోటాన నాగ ఝాన్సీరాణి( 584) పాఠశాల టాపర్‌గానే కాకుండా మండల టాపర్‌గా నిలిచారన్నారు. ముమ్మన నవ్య (583)మార్కులతో ద్వితీయ స్థానంలోనూ, గొర్లి ప్రసన్న (582) మూడోస్థానంలో నిలిచారన్నారు. 550 మార్కులకు పైబడి 34 మంది, 500 మార్కులకు పైబడి 71 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ సందర్భంగా మండల టాపర్ కోటాన నాగఝాన్సీరాణిని కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ ఆన్సీ జోసెఫ్ అభినందించారు.

## పాలీసెట్ విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కెవి.రమణ

ప్రజాశక్తి- దేవరాపల్లి: ఈనెల 10న జరగనున్న పాలిసెట్, ఇంకా ఎపిఆర్‌జెసి ప్రవేశపరీక్షల టిప్స్, టైం మేనేజ్‌మెంట్, ఇతర అంశాలపై విశాఖపట్నం కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ అవగాహన కల్పించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సూచనలతో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కెవి రమణ (ఎల్ఐసి రమణ), మండల అధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను ఆధ్వర్యంలో గత నెల 25 నుంచి దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఉచిత పాలిసెట్, ఎపిఆర్‌జెసి శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. తన సొంత నిధులతో 80మంది విద్యార్థులకు పాలిసెట్ మెటీరియల్‌ను అందించారు. అనంతరం డాక్టర్ కె.వి.రమణను నిర్వాహకులు ఘనంగా సత్కరించి, సమాచారహక్కు చట్టం పుస్తకాన్ని బహూకరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు చిరికి శ్రీనివాసరావు, పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ పెద్దినాయుడు, రాష్ట్ర కార్యదర్శి పోతల గోవిందు, ఆదిరెడ్డి ఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది కె.జ్ఞానేశ్వర్రావు, రమేష్ , ఉప్పు అజయ్ పాల్గొన్నారు.

## స్నేహభావంతో మెలగాలి

### -పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉప ముఖ్యమంత్రి బూడి



పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-దేవరాపల్లి: ప్రతిఒక్కరూ స్నేహభావంతో మెలగాలని, అప్పుడే జీవితాలకు వెలుగునిస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991-96 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు,ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడు ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరిస్తూ ఆరోగ్య పరిస్థితులు,యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. డ్రాయింగ్ టీచర్ ఎల్ సత్యనారాయణ పలు జానపద గీతాలు ఆలపించి అందరిని అలరించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు పాకల వీరభద్రరావు, బొడ్డు అప్పారావు, కష్ణ మాస్టర్, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, స్థానిక పాఠశాల హెచ్‌ఎం బి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి, వచ్చేనెల 11 వరకు ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కాండ్రేగుల జగన్ తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణనిస్తామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలకు పుస్తక పఠనంతోపాటు స్పోకెన్ ఇంగ్లీష్, స్వాతంత్ర్య సమరయోధులు, ఇతర ప్రముఖుల జీవితచరిత్రలను చదివించడం వంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వెంటనే గ్రంథాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

# అరకొర వేతనం .. అగమ్యగోచరం

- 20ఏళ్లకు పైగా మూగజీవాలకు సేవలు
- నేటికీ బతుకుకు కానరాని భరోసా
- ఉద్యోగభద్రత లేక అయోమయంలో గోపాలమిత్రలు



గోవులకు కృత్రిమ గర్భధారణ ఇంజిక్షన్ వేస్తున్న గోపాలమిత్ర

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :** పాడి పరిశ్రమ అభివృద్ధిలో కీలకమైన గోపాలమిత్రలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ కృత్రిమ గర్భోత్పత్తి, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ ఇలా అనేక సేవలు అందిస్తూ శ్రమిస్తున్న గోపాలమిత్రలకు ప్రభుత్వం నుంచి ఆదరణ కరువైంది. 20 సంవత్సరాలుగా సేవలందిస్తూ శ్రమిస్తున్న గోపాల మిత్రులు శ్రమదో పిడీకి గురవుతున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు న్యాయం చేస్తాయనే ఆశ వారిలో సన్నగిల్లుతోంది

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 25 మంది గోపాల మిత్రలు పని చేస్తున్నారు. నాడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో భాగంగా మన ప్రభుత్వం వస్తే గోపాల మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించి న్యాయం చేస్తానని మాట ఇచ్చారు. నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా ఆ హామీ అమలు కాలేదు. వీరంతా పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశుసంవర్ధక శాఖలో సేవలందిస్తున్నారు. ఇందుకుగాను నెలకు రూ.6,500 గౌరవ వేతనం మాత్రమే అందిస్తున్నారు. అది కూడా ఏ ఐదు నెలలకో, ఆరు నెలలకో ఒకసారి మాత్రమే ఇస్తున్నారు. 2022 డిసెంబర్ నుండి 2023 మే నెల వస్తున్నా ఇప్పటివరకు ఆ గౌరవ వేతనం అందలేదు. గ్రామాలలో వీరి పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే పశు సహాయకులకు సమానంగా సేవలందిస్తున్నా వీరికి మాత్రం కేవలం రూ.6,500రూ మాత్రమే వేతనం వస్తుంది. రెండు దశాబ్దాలుగా అందిస్తున్న వీరి సేవలతో పాడి పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. కృత్రిమ గర్భధారణ ద్వారా సంకరజాతి పాడి పశువుల అభివృద్ధే ధ్యేయంగా పాల ఉత్పత్తి గణనీయంగా పెంచేందుకు వీరు ఎంతో కృషి చేశారు. అయినా వీరికి సరైన గుర్తింపు లేదు. రైతు భరోసా కేంద్రాల్లో జగన్ ప్రభుత్వం పశు సహాయకులను నియమించడంతో వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీరంతా అభద్రతా భావంతో జీవితం నెట్టుకొస్తున్నారు. సచివాలయ సిబ్బంది మాదిరిగా యాప్ ద్వారా హాజరు వేసినప్పటికీ ప్రభుత్వపరంగా గుర్తింపు లేదు.

గోపాలమిత్రలు విజయవాడలో ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పుడు మంత్రిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ హామితో నిరసన విరమించినా అవి నీటి మూటలుగానే మిగిలి పోయాయి. ఎంతో మంది మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుతం వీరికి 20 సంవత్సరాల సర్వీసు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించలేదు. గ్రామాల్లో పని చేస్తున్న తమ పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



మూగజీవాలకు వ్యాక్సినేషన్ చేస్తున్న గోపాలమిత్ర

## జగన్‌ను సాగనంపేందుకు జనం సిద్ధం

### రావాడలో 'ఇదేం ఖర్మ'లో మాజీ మంత్రి బండారు



మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు

**ప్రజాశక్తి - పరవాడ:** నాలుగేళ్ల పాలనలో జగన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని, రానున్న ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని రావాడ పంచాయతీలో మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాట్లాడుతూ, వైసిపి దుర్మార్గపు పాలనపై విరుచుకుపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఏం చేసారో చెప్పాలని ప్రశ్నించారు. టిడిపి శ్రేణులతో కలిసి, సైకో పోవాలి, సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పైలా జగన్నాథరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్ప నాయుడు, బిసి సెల్ నియోజవర్గ అధ్యక్షులు నగిరెడ్డి చిన్నా రావు, కూండ్రపు శ్రీరామమూర్తి, బొండా తాతారావు, మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్ని దేముడు, గోర్లివానిపాలెం మాజీ ఎంపిటిసి గొర్లి శ్రీనివాస్, సారిపల్లి జోగినాయుడు, ఇందల కొండలరావు, రాయవరపు దేముడు పైలా సన్యాసిరావు, మరిశ అప్పలరాజు, తోట బాబూరావు, పైలా వరలక్ష్మి, పైలా చిన్న అక్కునాయుడు, గొంప మారునాయుడు, పైలా కుమారి, పైల లక్ష్మి, కొత్తపల్లి అపర్ణ, మొల్లి గంగాధర్ , కూండ్రపు శ్రీనివాస్, బండారు అప్పలనాయుడు, మరిసా శ్రీనివాస్, దాసరి గణేశ్, వియ్యపు నాగ సూరి అప్పారావు పాల్గొన్నారు

## టెన్త్‌లో శ్రీ చైతన్య టెక్నో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-పాయకరావుపేట:** పదవ తరగతి ఫలితాల్లో స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని విద్యా సంస్థల ప్రిన్సిపల్ పి.మాణిక్యాలరావు తెలిపారు. విద్యార్థులు పి.హరిణి 593 మార్కులు, బి.యశ్వంత్ లోవస్వామి 592, కే.శ్రీజ 590, ఎం.హర్షవర్ధన్ 590 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. 80 శాతం పైగా విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని, మాథ్స్, సైన్సు సోషల్‌లో 100 మార్కులు పలువురు విద్యార్థులు సాధించారని తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను సంస్థల ఏజీఎం ఎంవి సురేష్, ఆర్ఐ గోపీనాథ్, ఏవో విజయ్, డీన్ విజయ్ అభినందించారు

## గుంతల్లోని వర్షపు నీరు తొలగింపు



నీటిని తోడిస్తున్న వైసిపి నేత వరహాలు

**ప్రజాశక్తి -రావికమతం:** గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కవగుంట గ్రామ ఆర్ అండ్ బి రోడ్డు మధ్యలో నిలిచిన నీటిని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,కవగుంట గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాల్లో సుమారు ఐదు గ్రానైట్ క్వారీలు ఉన్నాయన్నారు. క్వారీ లారీలు అధిక బరువుతో కవగుంట గ్రామం మీదుగా తరలించడంతో గ్రామం మధ్యలో నాలుగైదు చోట్ల భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో చినుకు పడితే గొయ్యిలు పూర్తిగా నీటితో నిండి పోతున్నాయన్నారు. వాహన చోదకులు, పాదచారులు గొయ్యిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.సర్పంచ్ చొరవ తీసుకొని నీటిని బయటకు తొలగించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ వరకుమారి భీమన్నదొర, యూత్ ప్రెసిడెంట్ శేషు పాల్గొన్నారు.

## మంత్రి అమర్ వైఫల్యం వల్లే కోడూరు ఇండస్ట్రియల్ భూములు నిరుపయోగం

### మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ



మాట్లాడుతున్న పీలా గోవింద

**ప్రజాశక్తి-అనకాపల్లి :** రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వైఫల్యం వల్లే కోడూరు ఇండస్ట్రియల్ భూములు నిరుపయోగంగా మారాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం గవరపాలెం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, కోడూరు, వల్లూరు ఇండస్ట్రియల్ భూములు వెబ్‌సైట్‌లో కనిపించకపోతే పరిశ్రమలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో వచ్చినవి డ్రగ్స్, గంజాయి పరిశ్రమలేనని మండిపడ్డారు. పరిశ్రమల మంత్రిగా అమర్ న్యాడిల్స్, పానీపూరీ పరిశ్రమలను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను సిఎం జగన్ మోసపుచ్చారని మండిపడ్డారు.గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సదస్సు ద్వారా ఎన్ని ఉద్యోగాలు కల్పించారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ శిలాఫలకాలు వేయడం తప్ప, చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. టిడిపి హయాంలో చంద్రబాబు తీసుకువచ్చిన పరిశ్రమలకే శంకుస్థాపనలు చేస్తూ, వైసిపి నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో రాష్ట్రంలో నిరుద్యోగ శాతం 73శాతానికి పెరిగిందన్నారు. గంజాయి, డ్రగ్స్ హబ్‌గా రాష్ట్రం మారడంతో నిరుద్యోగ యువత వాటికి బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైకో చర్యలున్న జగన్‌రెడ్డిని పారిశ్రామిక వేత్తలు నమ్మడం లేదని, అందుకే పరిశ్రమలు రాలేదన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర, అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు బిఎస్ఎంకె జోగినాయుడు, అర్బన్ జిల్లా కార్యదర్శి పోలారపు త్రినాథ్, ఆళ్ళ రామచంద్రరావు, చదరం శివప్పారావు, పండురి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

### ప్రయివేటు వెంచర్లకు తరలింపు | చోద్యం చూస్తున్న అధికారులు

**ప్రజాశక్తి- చోడవరం :** మండలంలో పలుచోట్ల చెరువుల్లో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. వాల్టా చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతూ, ప్రయివేటు వెంచర్లకు తరలిస్తున్నా, వాటిని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం మండలంలో పిఎస్ పేట చెరువులో రెండు జెసిబిలతో మట్టిని తవ్వి, ట్రాక్టర్లతో తరలించే పని చేపట్టారు. ఆదివారం కావడంతో అధికారులెవరూ ఉండని నేపథ్యంలో ఈ అక్రమ మట్టి తరలింపు కొనసాగింది. లక్ష్మీపురం చెరువులోనూ మట్టిని తరలిస్తున్నారు. పట్టపగలే ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు ప్రక్రియ కొనసాగుతున్నా, అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తా విస్తోంది. ఆదివారం సెలవు అయినంత మాత్రాన సోమవారం, ఇతర పనిదినాల్లోనైనా ఈ అక్రమంపై ఎందుకు స్పందించడం లేదో అంతుపట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



చెరువులోంచి మట్టిని తరలిస్తున్న జెసిబి, ట్రాక్టర్లు

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ సహాయ సహకారాలతో ఎంపిపి గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో విశాఖపట్నం, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, అనకాపల్లి రాజా ఆప్టికల్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం గోపాలపురం గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించిన వైద్య శిబిరంలో 182 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి అంతరకుసుమాలున్నట్లు నిర్ధారించి, కంటి ఆపరేషన్ కోస విశాఖపట్నం శంకర్‌ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. తాటికొండ జీవన్ ఆర్థికసాయంతో ఉచితంగా మందులను అందజేశారు. వైద్య శిబిరంలో తనిఖీ చేయించుకున్న రోగులకు 50 శాతం రాయితీతో కళ్లద్దాలు అందిస్తామని రాజా ఆప్టికల్స్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జెర్రిపోతుల కష్ణ, కరణం సత్యనారాయణ, గొర్లి తాతారావు, గొర్లి భాను, గోవాడ మహేష్, సేనాపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యదర్శిగా రాము



నియామకపత్రం అందుకుంటున్న రాము

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యదర్శిగా మెట్టపాలెం గ్రామ సర్పంచ్ మువ్వల రాము నియమితుల య్యారు. ఈ మేరకు ఆదివారం సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు.బిసిల సంక్షేమానికి కృషి చేయాలని కృష్ణయ్య ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రామును పలువురు తెలుగుదేశం నాయకులు, బిసి సంక్షేమ సంఘం నేతలు అభినందించారు.

# యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలో కృష్ణదేవిపేట పాఠశాల ప్రహరీ గోడను ఆనుకొని అక్రమ కట్టడాల నిర్మాణాలు సాగుతున్నాయి. ఇది గుర్తించిన అధికారులు మూడు నెలలు క్రితం తొలగించాలంటూ నోటీసులు జారీ చేశారే తప్ప పట్టించుకోలేదు. దీంతో అక్రమ కట్టడాలు మరింత జోరందుకున్నాయి. ఫలితంగా తారు రోడ్డు రోజురోజుకు కుచించుకుపోతోంది. ఈ రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాల ప్రహరీపై చక్కని బొమ్మలు వేసేందుకు ఈ అక్రమ నిర్మాణాలు తొలగించాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు పంచాయతీ, అర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయా శాఖల అధికారులు నోటీసులతో సరిపెట్టుకోవడంతో కొంతమంది ఇప్పటి వరకు ఉన్న బడ్డీల స్థానంలో పునాదులు వేసి భవన నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగుచర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కిరణ్మయిని వివరణ కోరగా ఆక్రమణలకు గురవుతున్న స్థలం రహదారులు, భవనాల శాఖకు చెందిందని తెలిపారు. ఆక్రమణలపై ఆర్ అండ్‌బి అధికారులకు సమాచారం అందించామన్నారు. సోమవారం ఆక్రమణదారులతో మాట్లాడి వాటిని తొలగిస్తామని అధికారులు చెప్పినట్లుగా ఆమె తెలిపారు.



అక్రమంగా నిర్మిస్తున్న కట్టడం

## మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:** ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశాలకు ఆన్లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వేములపూడి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు.



ఆసక్తి కలవారు ఈనెల 10వ తేదీ నుండి %https/apms.ap.gov.in/apms% అనే వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని, చివరి తేదీ మే 25 అని తెలిపారు. జూన్ 11న ఆదివారం ఉదయం పది గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ లకు రూ.75, ఓసీ, బీసీ లకు 150 రూ.ఫీజు చెల్లించవలసి ఉంటుందన్నారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్‌ను మోడల్ స్కూల్ లో అందజేయాలని సంధ్యారాణి తెలిపారు.



## అల్లూరి పార్కులో మే పుష్పాలు

**ప్రజాశక్తి-గొలుగొండ:** కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో మే పుష్పాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రతీ ఏటా మే నెలలో పూసే ఈ పుష్పాలు వికసిండంచంతో పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి.

## ఇద్దరికి షోకాజ్ నోటీసులు

**ప్రజాశక్తి-రోలుగుంట:**రోలుగుంట మండల సమాఖ్యలో వికలాంగుల సామాజిక పెట్టుబడి నిధి(సిఐఎఫ్) దుర్వినియోగంపై గతంలో రోలుగుంట సిసిగా పని చేసిన(ప్రస్తుతం కె.కోటపాడు ఏపిఎం) పి.వెంకటలక్ష్మీకి, గతంలో సిసిగా పని చేసిన(ప్రస్తుతం రావికమతం సిసి) పైల వెంకటసత్యనారాయణలకు డిఆర్‌డిఎ పిడి బి.లక్ష్మీపతి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రోలుగుంట వికలాంగుల సమాఖ్యలో నగదు పుస్తకం ఆధారంగా మండలంలోని 53 సంఘాలకు రూ.42లక్షల రుణాలను 2006 సంవత్సరంలో మంజూరు చేశారని, వీటి దుర్వినియోగం జరిగినట్టు విచారణలో తేలినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే కొమరవోలు గ్రామ సంఘంలో శివాజీ సంఘానికి సిఐఎఫ్ కింద మంజూరు చేసిన రూ.1,25,000లలో అప్పటి సిసి పి.వెంకట నాగేశ్వరరావు, సంఘం సభ్యులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారని సదరు షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని అందులో పిడి స్పష్టం చేశారు.

# అల్లూరి స్ఫూర్తితో మత్స్యకారుల పోరాటం

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు

**ప్రజాశక్తి -నక్కపల్లి:** హెటిరో పైప్ లైన్ కు వ్యతిరేకంగా విప్లవ వీరుడు అల్లూరి స్ఫూర్తితో పోరాటం కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు సూచించారు. హెటిరో డ్రగ్స్ పైపు లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న మహా శాంతియుత ధర్నా 521వ రోజుకు చేరింది. ఆదివారం శిబిరం వద్ద స్వాతంత్ర్య సమరయోధులు విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు 99 వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన వీరుడు, యోధుడు అల్లూరి సీతారామరాజు అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.మత్స్యకారులకు ఉపాధి లేకుండా చేసి, అనారోగ్యాలు పాలు చేసిన హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ కి వ్యతిరేకంగా రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి పోరాట స్ఫూర్తితో పోరాడుదామన్నారు. హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ పైపులైనుకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు మత్స్యకారులు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు వాసుపల్లి నూకరాజు, పిక్కిగంగరాజు, పిక్కి కోదండ, గోసల సోమేశ్వరరావు, మైలపల్లి మహేష్ బాబు, దైలపల్లి శ్రీను, చొక్కా కాశీ, చేపల సోమేష్, వాసుపల్లి సోమి, కోడా కాశీరావు, బొంది నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు

## యాదవుల అభ్యున్నతికి కృషి

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం:**యాదవులు అన్ని రంగాలలో రాణించాలని అనకాపల్లి జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు భరణికాన బాబూరావు ఆకాంక్షించారు. ఆదివారం తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో ఆయన పర్యటించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడిన గ్రామానికి చెందిన యాదవ నాయకుడు మామిడి నాగరాజును పరామర్శించారు. పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థిని గొర్లపూజితను శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ,యాదవజాతి అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తూ జిల్లాలో పర్యటనలు చేస్తూ వారిలో చైతన్యం నింపుతున్నామన్నారు. జిల్లా స్థాయిలో రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యే టిక్కెట్లను యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.పదవతరగతి, ఇంటర్ లో మెరుగైన ఫలితాలు సాధించిన పేద విద్యార్థులకు తమ సంఘం ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షులు వియ్యపు సింహాచలం, ప్రధాన కార్యదర్శులు సబ్బి శ్రీను, సోమునాయుడు, చోడవరం నియోజకవర్గ అధ్యక్షులు మొల్లి ప్రసాద్, పాయకరావుపేట నియోజకవర్గ అధ్యక్షులు కోన అప్పలరాజు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న నేతలు



నగదు ఇస్తున్న నాయకులు

## కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-రావికమతం:**గత కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న బాధితునికి రావికమతం మండల జనసైనికులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలో గొంప గ్రామానికి చెందిన పల్లా అప్పారావు 50 గత కొంతకాలంగా కిడ్నీలు రెండు డ్యామేజ్ కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతూ మంచానికే పరిమితం అయ్యాడు. భార్య మనీ కూడా షుగరు వ్యాధితో ఇదివరకే ఒక కాలును కోల్పోయింది. భార్యా భర్తలిద్దరూ మంచాన పడటంతో జనసేన పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం రూ.7100 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జనసైనికులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

## కెవిపిఎస్ ఆధ్వర్యాన నిరసన

**ప్రజాశక్తి-రోలుగుంట:**మండలంలోని కొంతలం గ్రామంలో ఎస్సీ కాలనీ డ్రైనేజీని శుభ్రం చేసి నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, కొంత కాలంగా ఎస్సీ కాలనీలో డ్రైనేజీ దుర్భరంగా ఉందన్నారు. డ్రైనేజీ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ లేకపోవడంతో వర్షం పడినప్పుడు నీరు ఇళ్లల్లోకి చేరుతుందన్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు కె.బాలరాజు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధిలో పాత్రికేయులు కీలకం

### ఉప ముఖ్యమంత్రి బూడి



మాట్లాడుతున్న బూడి ముత్యాలనాయుడు

**ప్రజాశక్తి-మాడుగుల:**సమాజానికి పాత్రికేయులు ఎంతో అవసరమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక తులసి కళ్యాణ మండపంలో మాడుగుల ప్రెస్ క్లబ్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సమస్యలు, లోటుపాట్లు వెలుగులోకి తీసుకు వచ్చి సమాజ అభివృద్ధికి మీడియా ప్రతినిధులు శ్రమిస్తున్నారన్నారు. కొందరు పాత్రికేయులు లేని విషయాలు వెలుగులోకి తీసుకు వచ్చి సమస్యలు సృష్టించడం సరి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ పోలి నాయుడు, ఎంపిపి పెదబాబు, సర్పంచ్ కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, గోళ్ళవిల్లి సంజీవరావు, డిపిఅర్‌ఓ సాయి బాబా, కర్రి సత్యం, పుప్పాల అప్పలరాజు, దంగటి సూర్యారావు, ఎపియుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షులు స్వామి, కార్యదర్శి జోగి నాయుడు, చంద్ర రావు, రామకోటి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు త్రినాథ్, వేణు, సురేష్ సాంతో పాల్గొన్నారు.

**రావికమతం:**ఏ.పీ.యూ.డబ్ల్యూ.జే మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా రావికమతం మండలానికి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి ఇల్లపు చిన్న సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ, మాడుగుల ప్రెస్ క్లబ్ పరిధిలోని నాలుగు మండలాల విలేకరుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.



వేణును సన్మానిస్తున్న జర్నలిస్టులు

## జర్నలిస్టు వేణుకు ఘన సన్మానం

**ప్రజాశక్తి- వడ్డాది:**ఏపీయూడబ్ల్యూజే మాడుగుల ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం లో బుచ్చయ్య పేట మండల విలేఖరి వేణును ఘనంగా సన్మానించారు. ఆదివారం తులసి కళ్యాణమండపంలో జరిగిన ఏపీయూడబ్ల్యూజే సిల్వర్ జూబ్లీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విలేకరిగా ఉత్తమ సేవలు అందించిన బత్తుల వేణుని జర్నలిస్ట్ సంఘాలు సన్మానించాయి. మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గౌరీపట్నం త్రినాథ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. డిపిఆర్‌ఓ సాయిబాబా, ఏపియు డబ్ల్యూజె జిల్లా కార్యదర్శి జోగినాయుడు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు చంద్రరావు, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు శరగడం రామకోటి, మాడుగుల ప్రెస్ క్లబ్ కార్యదర్శి వేణు, జర్నలిస్ట్ సురేష్ శాంతో పాల్గొన్నారు.




మందులు ఇస్తున్న ట్రస్టు సభ్యులు

### సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు ఆధ్వర్యాన

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-నర్సీపట్నం:**పట్టణంలోని ఐదు రోడ్ల జంక్షన్‌లోని అపోలో మెడికల్ సెంటర్ వద్ద సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్టు ఛైర్మన్ దాడి శ్రీను, ప్రోగ్రామ్ డైరెక్టర్ బి.రమేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు బి.సుధీర్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేసి 120మందికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

**అనకాపల్లి, విశాఖ జిల్లాల వ్యాప్తంగా ఆదివారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.**

**అనకాపల్లి** : విప్లవ వీరుడు అల్లూరి ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ రవి పటాన్‌శెట్టి పిలుపునిచ్చారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లో సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ అమాయకులు బలహీన వర్గాల వారికి ఎక్కడ అన్యాయం జరిగినా వారి తరుపున నిలిచి, అల్లూరి పోరాటం సాగించారన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ పి.వెంకటరమణ చోడవరం, సబ్బవరం పాలిటెక్నిక్ కళాశాల వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



. అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

స్థానిక రైల్వే స్టేషన్ దరి అల్లూరి విగ్రహానికి అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బోయిన భానుమూర్తి యాదవ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు కాళ్ల సత్యనారాయణ, సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సేనాపతి రాజు, సీనియర్ కాంగ్రెస్ నేత, టి. సుబ్బిరామిరెడ్డి సేవా పీఠం మాజీ సభ్యులు కెవి మాణిక్యం పాల్గొన్నారు.

**అనకాపల్లి :** విప్లవజ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని గూడ్స్ రోడ్డు వద్దనున్న అల్లూరి విగ్రహానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే, నియోజకర్గ టిడిపి ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సీపట్నం, కేడీ.పేటలోని అల్లూరి సీతారామరాజు మ్యూజియం, పార్కును అభివృద్ధి చేస్తామన్న హామీని వైసిపి ప్రభుత్వం విస్మరించందని ఆరోపించారు. టిడిపి బిసి సాధికార రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్, అర్బన్ జిల్లా కార్యదర్శి పోలారాపు త్రినాథ్, రాష్ట్ర సాంస్కృతిక విభాగ నాయకులు పెనుమత్స సాయిరాజు, ఆళ్ల రామచంద్రరావు, సరిసా బుజ్జీ, దొడ్డి రాజేంద్ర, మళ్ల కృష్ణ పాల్గొన్నారు.

**బుచ్చయ్యపేట** : రాజాంలో అల్లూరి విగ్రహానికి పలువురు నేతలు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. మాజీ సర్పంచ్ సిఎఫ్‌టియుఐ జాతీయ ఉపాధ్యక్షుడు నాగులాపల్లి సత్యనారాయణ, టిడిపి నేతలు మరిసా సతీష్, మరిసా నరేషు, జెర్రిపోతుల రాజు ఎండపల్లి రాజు, మాణిక్యం గూడుపు సూర్యనారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

**మునగపాక రూరల్:** తోటాడ, గవర్ల అనకాపల్లి గ్రామాలలో అల్లూరి వర్ధంతి, సుందరయ్య జయంతులను నిర్వహించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆధ్వర్యంలో అల్లూరి, సుందరయ్య చిత్రపటాలకు సిఐటియు నేతలు, గ్రామపెద్దలు నివాళులర్పించారు. సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, దొడ్డి కోటేశ్వరరావు, ఎలమంచిలి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సత్యజగ్గారావు దాడి శ్రీనివాస్, దాడి రమణబాబు, పి నాగేశ్వరరావు, నరేంద్ర కుమార్, కాండ్రేగుల రాము, పెంట కోట జోగినాయుడు, ఆళ్ళ సూరిబాబు, దొడ్డి అప్పారావు పాల్గొన్నారు.

**-గొలుగొండ:** అల్లూరి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం కోరారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా మండలంలో ఎఎల్ పురం అల్లూరి పార్కులో అల్లూరి సమాధుల వద్ద ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ముందుగా పార్క్‌లో ఉన్న అల్లూరి కాంస్య విగ్రహానికి, అల్లూరి గంటల సమాధులకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఇంచార్జి తహశీల్దార్ జి.ఆనందరావు, జిల్లా వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, కేడీపేట ఎస్సై ఉపేంద్ర, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ హరి, సర్వేయర్ చినబాబు, స్థానిక ఎంపీటీసీ చింతల బుల్లి ప్రసాద్, విఆర్ఓ శ్రీధర్ స్థానిక పంచాయతీ కార్యదర్శి వై.శ్రీను, లోచల రమేష్, విఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**నక్కపల్లి:** మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ అధికారి జనార్ధన ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, నూకరాజు, సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు .

**గొలుగొండ:** చీడిగుమ్మల, చోద్యం, కృష్ణదేవిపేటలో సిపిఐ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామానాయుడు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు రాధాకృష్ణ, పావడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేటలో...

**గొలుగొండ:** చీడిగుమ్మల గ్రామంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామానాయుడు, లగుడు వెంకటరమణ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ పివిఎస్.మాధవ్ కృష్ణదేవిపేటలోని అల్లూరి సమాధులకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

**నర్సీపట్నం టౌన్:** అల్లూరి ఆశయాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని సిపిఎం నాయకులు డి.సత్తిబాబు విమర్శించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గీతాకృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

స్థానిక అల్లూరి విగ్రహానికి సిపిఐ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్ నుండి మన దేశాన్ని కాపాడు కోవాలన్నారు. దేశ సంపదను నేటి పాలకులు ప్రజలపై పెనుబారం మోపుతూ ప్రజా సంపదను అమ్మకాలు, తాకట్టు పెడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, డిసిహెచ్ క్రాంతి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎల్.వి.రమణ, సీనియర్ లాయర్ ప్రకాష్, నూకరాజు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో...





. నక్కపల్లిలో...

## అల్లూరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన..

**ఎంవిపి.కాలనీ :** సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి అల్లూరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరుగుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు అల్లూరి స్ఫూర్తితో పోరాడాలన్నారు. అల్లూరిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి నర్సింహరాజు, ఎస్.సంజీవయ్య, సీనియర్ సభ్యులు నూతన్, పాల్ ప్రభాకరరావు, శాంతారాం, ఎన్.వెంకటరావు, సాంబమూర్తి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నర్సింగరావు, తదితరులు



మల్కాపురంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

**ములగాడ :** విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించారు. 59వ వార్డు నెహ్రూనగర్, 62వ వార్డు త్రినాధపురం, దుర్గానగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ, 63వ వార్డు క్రాంతినగర్ చింతల్లోవలో అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు ర్పించారు. సిపిఎం జోన్ కార్యదర్శి పూడి పైడిరాజు, సిఐటియు జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, భవన నిర్మాణ సంఘం నాయుకులు జె.రామునాయుడు, బి.జగ్గునాయుడు, పిసిని రామారావు, డివైఎఫ్ఐ మల్కాపురం జోన్ అధ్యక్షులు బి.శ్రీను, కార్యదర్శి ఎస్.వాసు, యు.రాజు, వై.గంగాధర్, వెంకటేష్, కుమార్, సురేష్, నగేష్, నవీన్, కిశోర్‌మహేంద్ర, జి.నరేష్, ఎల్.కృష్ణసంతోష్, గణేష్, అర్జునరావు, హరి, శంకర్, పొన్నాడ రామారావు, బి.రమణ డి.గోపాల్ తదితర్లు పాల్గొన్నారు.

**భీమునిపట్నం :** స్థానిక ఎండిఒ కార్యాలయంలో అల్లూరు చిత్రపటానికి జెడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపిపి బి.బంగారునాయుడు, వైసిపి నాయకులు గాడు తాతినాయుడు, ఎండిఒ, పి.వెంకటరమణ, ఎన్ఆర్ఇజిఎస్ ఉద్యోగులు, సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక బీచ్ వద్ద ఉన్న అల్లూరి పార్కులో వైసిపి ఆధ్వర్యాన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి 3వ వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు, పార్టీ నాయకులు కదిరి ఎల్లాజి, కోండ్రు రామసూరప్పడు, పాసి మధు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరికి ఘన నివాళి

స్థానిక బీచ్ వద్ద టిడిపి ఆధ్వర్యాన అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పార్టీ నాయకులు సిహెచ్.రమణ, గండిబోయిన పోలిరాజు, కెఎస్ఆర్.కృష్ణారావు, ఎస్.జోగారావు, తెలుగు మహిళ అధ్యక్షులు పైడిపల్లి ఎల్లయ్యమ్మ పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన స్థానిక జిఆర్.భవన్‌లో అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లు బాబూరావు, కానూరి రాంబాబు, టి.సోమరాజు, నూలు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**సీతమ్మధార** : సీతమ్మధార జంక్షన్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సీతమ్మధార క్షత్రియ సంక్షేమ సమితి, క్షత్రియ యూత్ ఆధ్వర్యాన వర్ధంతిని నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ముఖ్యఅతిథిగా హాజరై అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, క్షత్రియ సంక్షేమ సమితి ప్రతినిధులు ఎంఎస్ఎన్.రాజు, డిఎస్‌పి.వర్మ, ఎల్ఎన్.రాజు, కె.హరిరాజు, కెవిబిఎస్ నాగరాజు, కె.శ్రీనివాస్‌రాజు, కె.రామకృష్ణరాజు, యూత్ వింగ్ మెంబర్స్ పృధ్వీవర్మ, శ్రావణ్ వర్మ, కిరణ్ వర్మ, రవీంద్ర వర్మ, వర్మ, సాయి నవీన్ వర్మ, గణేష్ వర్మ, రోహిత్ వర్మ, అభివర్మ, సంతోష్ వర్మ, రాజా వర్మ ప్రశాంత్ రాజు, సీనియర్ నాయకులు ఆళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ఆరిలోవ :** సిపిఐ ఆరిలోవ కమిటీ ఆధ్వర్యాన శ్రీకృష్ణాపురంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్‌కె.రెహ్మాన్, ఎ.దేవుడమ్మ, కె.లక్ష్మణరావు, కాసుబాబు, బి.చిరంజీవి, షేక్ మస్తాన్‌బి పాల్గొన్నారు.

**ఆనందపురం :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు అల్లూరికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, సర్పంచులు అప్పలరాజు, లెంక రాంబాబు, కోరాడ ముసలి నాయుడు, ఎంపీడీవో అడప లవరాజు, పరిపాలనాధికారి నాగేశ్వరరావు, కార్యదర్శి కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

**పద్మనాభం :** మండలంలోని పాండ్రంగి గ్రామంలో అల్లూరి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు, జనసేన భీమిలి ఇన్‌ఛార్జి సందీప్ కుమార్, పద్మనాభం ఎంపిపి కె.రాంబాబు, గ్రామ సర్పంచ్ పల్లి ఝాన్సీ, స్థానిక నాయకులు ఆర్ఎస్.దేముడుబాబు, పి.మహేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**పెందుర్తి :** 96వ వార్డు పరిధి సిఐటియు కార్యాలయంలో అల్లూరి వర్ధంతిని నిర్వహించారు. ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్, సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, సిఐటియు నాయకులు శంకరరావు, అప్పలనాయుడు, రజిని తదితరులు పాల్గొన్నారు.

**గాజువాక :** పెదగంట్యాడ సిఐటియు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి సిఐటియు నాయకులు బి.ఆనంద్, సుధమల శంకరం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొవిరి అప్పలరాజు, జి శ్రీనివాస్, నమ్మి రమణ, పాల అప్పలరెడ్డి, బి.సింహాచలం, బి.రాజు, వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ఉక్కునగరం :** ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టీల్ సిఐటియు కార్యదర్శి డిసిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.బాలశౌరి, కెవిపిఎస్ నాయకులు చిరంజీవి, స్టీల్ సిఐటియు నాయకులు వి.ప్రసాద్, కెపి.సుబ్రహ్మణ్యం, మొహిద్దిన్, పుల్లారావు, శ్రీరామచంద్రమూర్తి, మనోజ్, సువర్ణ రాజు, పార్థసారథి పాల్గొన్నారు.



ఉక్కునగరంలో నివాళి అర్పిస్తున్న నాయకులు